
# స్టేటస్

-గుజ్జెటి గణేష్

పెళ్ళయిన ఈ మూడు సంవత్సరాల కాలంలో ఏనాడూ భర్త ఎదుట నిలబడి మాట్లాడ్డానికి గానీ, భర్తచేసే పనులకు అడ్డు చెప్పడానికి గానీ సాహసించని శారద మొదటిసారిగా ఆరోజు తెగించి భర్తతో అంది...




"ఎందుకండీ... ఈ డాంబికాలు? లేని భేషజాలు? ఎవరైనా చూస్తే నవ్విపోరూ?!"

దినచర్యగా పసుపులో అన్నం మెతుకు అద్ది మీసానికి అంటించుకుంటున్న అప్పారావు భార్య మాటవిని ఉలిక్కి పడ్డాడు. భార్య మాటలు మింగుడు పడలేదు. తలతిప్పి భార్యవంక తీక్షణంగా చూశాడు.

భర్త చూపుల్ని పసిగట్టిన శారదకు గుండె దడ పెరిగింది. నుదుటిపై చెమట పట్టింది. మీద ఎక్కడ విరుచుకడ్తాడో అన్న భయంతో నేల చూపులు చూస్తూ "అది కాదండీ...! మీరు రోజు ఇలా..."

"ఛత్... ఊర్కో పిచ్చి మొహమా!" ఆమె మాటలకు మధ్యలోనే అడ్డుపడి "ఇది డాంబికాలు, భేషజాలు కాదే... స్టేటస్ నిలబెట్టుకోవడం! చూడూ... రోజూ నువ్వు చేసిన దోసకాయ పప్పుతోనో, గోంగూర పచ్చడితోనో, చారుతోనో కిమ్మనకుండా నొక్కించేస్తున్నావా!

కాని, మీసానికి అంటించిన ఈ పసుపుతో అద్దిన మెతుకు నిగనిగ లాడుతూ... నన్ను రోజూ చికన్ పలావ్, మటన్ బిర్యాని తిన్నట్టు రుజువు చేస్తోంది. ఈ మెతుకు పుణ్యమా అని రోజూ నా గురించి ఆఫీసులో అందరూ ఎంత గొప్పగా మాట్లాడుకుంటున్నారో తెలుసా!

అంతేకాదు, కష్టమనకుండ ఓర్పుతో రోజూ నాకు మాంచి విందుభోజనాలు వండిపెడ్తున్నావని నిన్ను కూడా ఎంతో మెచ్చుకుంటున్నారు... పరే... సరే... ఆ గూడు పురాణి నీకు తెలీదు. నువ్వు తలూపేసుకో" అని ఆఫీసుకెళ్ళి పోయాడు అప్పారావు.

భర్త చెప్పిన మాటలు విని 'ఔరా' అనుకొని ముక్కున

వేలేసుకొని ప్రతిమలా నిలబడిపోయింది శారద.

రానురానూ అప్పారావు మీసంలోని మెతుకు ఆఫీస్ స్టాఫ్‌లో మరీ చర్చనీయాంశమైంది...

"ఏంటి గురూ! అప్పారావ్ ఇలా రోజూ చికన్, మటన్‌లతో విందు భోజనా లారగిస్తున్నాడంటే... ఒకవేళ టేబుల్ క్రింద చేయి పెద్దదయినట్టుంది!?"

"అబ్బే... అదేం కాదు! పిల్లాపేచులేరు. లింగీ లింగడు అన్నట్టు ఇద్దరే అయిరి. వచ్చే నాలుగు అంకెల జీతం ఎవరికి పెట్టే ఛస్తారని!"

"ఏదేమైనా... అదృష్ట వంతుడేనోయ్!"

"అంతే కాదోయ్! రోజూ ఇలా ఓపికతో వండిపెడ్తు న్నందుకు వాళ్ళ ఆవిణ్ణి కూడా అభినందించాలోయ్!"

అలా అప్పారావు స్టేటస్ గూర్చి తలో విధంగా అభిప్రాయాలు వెలిబుచ్చసాగారు.

అతని ఆయాసం చూసి "ఈరోజు మీ ఆవిడ ఏం వండిపెట్టారండి అప్పారావుగారు?" అని ఎవరో ఒకరు అడిగేవారు.

అందుకు "చికన్ పలావ్ చేసింది. వద్దన్నా వినకుండా బలవంతపెట్టి పీకల్దాక తినిపించింది" అంటూ వాళ్ళ నోళ్ళూరించేట్టు సమాధానం చెప్పి, మీసానికి అంటించు కున్న అన్నం మెతుకు తీసి చూపించేవాడు.

అప్పారావు మాటలు వింటూనే వాళ్ళ నోళ్ళలో నిజంగానే నీళ్ళూరేవి. అంతేకాదు; తమ భార్యల సోమరితనాన్ని గుర్తుతెచ్చుకొని లోలోన మండిపడేవారు. కొందరైతే ఓపిక లేక-

"అదృష్టమంటే నీదేనోయ్ అప్పారావ్! నా భార్య ఉంది చూడు... కాస్త పప్పన్నం నా ముఖాన కొట్టడానికే నానా హైరాన పడిపోతుంది."

"అమ్మో... నా భార్య అయితేనా.. వెలగబెట్టేది గుమాస్తాగిరీ... ఇంకా పూటకు నాల్గు కూరలా అని చిర్రుబుర్రు లాడ్తుంది."

"నేను అ పప్పన్నానికి కూడా నోచుకో లేదండయ్య బాబూ! రోజు ఆవకాయ, చద్దన్నమే గతి."

తలో రకంగా తమ తమ గోడు విన్నవించే వారు.

తన మాటల ప్రభావంతో వాళ్ళు బాధపడ్డం చూసి అప్పారావు తెగమురిసి పోయేవాడు. వాళ్ళవంక పెద్ద ఫోజు పెట్టి సానుభూతిగా చూసేవాడు.

★ ★ ★

ఆ రోజు ఆదివారం...

ఉదయం పది గంటలు కావస్తున్నా ఇంకా భోజనానికి పిలుపు రాలేదు.

ఇక ఆకలికి తాళలేక చదువుతున్న దినపత్రికను ప్రక్కన గిరాటేసి "ఏమేవ్... ఈ రోజు భోజన మేమైనా పెట్టేదుందా... లేదా?" అంటూ వంట గదిలోకి వెళ్ళాడు అప్పారావు.

ఇంకా అప్పటికి అన్నం వార్చుతోన్న భార్యను చూసి "ఏంటీ... ఇంకా అన్నమే కాలేదా? ఇక కూరెప్పుడు తగలెడ్తావే...!" అన్నాడు చిరాగ్గా.

"కాస్త ఓపిక పట్టండి! నిన్న వద్దంటూంటే వినిపించు కోకుండా ఆ పచ్చికట్టెలు బేరం చేశారు. ఒక్క కట్టెకాలి చావట్లేదు." పొగతో నిండిన కళ్ళను తుడుచుకుంటూ అంది శారద.

"ఏమైనా మటనా, చికనా... పప్పుచారేగా... ఓ అరగంటలో చేస్తాను ఉండండి!"

భార్య చివరగా అన్నమాట అప్పారావు హృదయంలో గురిచూసి వదిలిన బాణంలా గుచ్చుకుంది.

"మాటకు మాట కొట్టి పెట్టడం మీ ఆడవాళ్ళకే చెల్లిందిలే! సరే... ఆ వార్చిన గంజి పళ్ళెంలో పోసి... నాలుగు ఉప్పరాళ్ళేసి ఇలా ఇవ్వు... ఆకలి దంచేస్తోంది.’ ’ అని చెప్పి ముందు గదిలో కొచ్చి కూర్చున్నాడు.

రెండు నిమిషాల్లో పళ్ళెంలో గంజి చెంబుతో నీళ్ళు పట్టుకొచ్చి భర్తకిచ్చి వెళ్ళింది శారద.

ఆ గంజిని చూస్తూనే అప్పారావు ప్రాణం లేచి వచ్చింది. క్షణం ఆలస్యం చేయకుండ అమాంతం పళ్ళెం రెండు చేతుల్లో ఎత్తి తాగడానికి ఉద్యుక్తుడయ్యాడు.

సరిగ్గా ఆ సమయంలోనే "అప్పారావ్..." అన్న పిలుపు వినిపించింది.

అప్పారావు గంజి తాగడం ఆపి తలెత్తి గుమ్మంవైపు చూశాడు. అంతే; అతని గుండె గుభేలుమంది. ఒక్కసారి వొళ్ళంతా వణుకు పుట్టింది.

కారణం - అతని ఆఫీసులో పనిచేసే తోటి ఉద్యోగస్తులు ఇద్దరు గడపలో నిలబడి ఉన్నారు.

రోజు అతని మీసంలోని మెతుకు గురించి ఆరాలు తీసేది కూడా ఆ ఇద్దరే. అందుకే, వాళ్ళు తన పరిస్థితిని ఎక్కడ పసిగట్టారోనని బెంబేలెత్తిపోసాగాడు.

అయినా, బ్రతకనేర్చిన వాడికి బండెడు ఉపాయా లన్నట్టు వెంటనే ఓ మెరుపులాంటి ఆలోచన తట్టింది అప్పారావుకు.

అంతే; ఎత్తిన పళ్ళెం ఎత్తినట్టు క్షణమైనా ఆలస్యం చేయకుండ నెత్తిపై కుమ్మరించుకున్నాడు.

అది చూసిన మిత్రులిద్దరు "అరెరే... అలావేడి వేడి గంజి నెత్తిమీద పోసుకున్నావేంటి అప్పారావ్?" అంటూ పరుగెట్టుకుంటూ దగ్గరికొచ్చి "ఇలా ఆత్మహత్య చేసుకునే ఖర్మ నీకేం పట్టింది?" అని గాబరాగా అడిగారు ముక్త కంఠంతో.

కానీ, వచ్చే దు:ఖాన్ని అదిమి పట్టి "మీరేమి కంగారు పడకండి ఫ్రెండ్స్! ఎన్ని సబ్బులు వాడినా, ఎన్ని షాంపూలు వాడినా తలకు పట్టిన జిడ్డు వదలటం లేదు. అందుకే... ఈరోజు ఆదివారం కదా... స్థిరంగా తలరుద్దు కుందామని ఇలా గంజి పట్టిస్తున్నాను."

అని ఎంతో గంభీరంగా కోతలు కోసి...

"మీరు కూర్చోండి... ఇప్పుడే వస్తాను!" అని లోపలి కెళ్ళాడు... పాపం అప్పారావు.

## పరిచయం



పేరు : గుజ్జెటి గణేష్

స్వస్థలం : అర్గుల్ గ్రామము,జక్రాన్‌పల్లి మం.

వృత్తి : ఆర్.టి.సి.కండక్టర్(ఆర్మూర్)

అనుభవం : పదమూడేళ్ళ సాహిత్య అనుభవం

అభిమతం : కుప్పలు తెప్పలుగా చెత్త కథలు వ్రాసేకంటే, పాఠకుల అభిమానం చూరగొనే కొన్ని కథలైనా వ్రాయాలనే తపన.

పిల్లలు : ఇద్దరు కుమారులు 1)గంగాచరణ్ 2)సాయిచరణ్

అభిమాని : కష్టకాలంలో నాతోడుగా నిలిచి ఇప్పటికీ నా కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్న నా శ్రీమతి గుజ్జెటి కళావతి గారే నా మొదటి అభిమాని.

-గుజెట్టి గణేష్,

ఆర్.టి.సి. కండక్టర్,ఆర్మూర్.